ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించాలి

- కలెక్టర్ ప్రావీణ్య
- గ్రీవెన్స్‌కు 71 దరఖాస్తులు

వరంగల్, ఫిబ్రవరి 3 : ప్రజా సమస్యలపై అధికార యంత్రాంగం తక్షణమే స్పందించాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వచ్చిన వారిని సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ప్రజలు వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఆమె బాధితులకు హామీ ఇచ్చారు. కాగా, గ్రీవెన్స్‌కు మొత్తం 71 దరఖాస్తులు రాగా, గ్రేటర్ కార్పొరేషన్ పరిధిలోని సమస్యలపై 14 వచ్చాయి. అలాగే ఎంజీఎం దవాఖాన, రెవెన్యూ శాఖలకు సంబంధించిన దరఖాస్తులూ ఉన్నాయి. కార్యక్రమంలో డీఆర్వో గణేశ్, ఆర్డీవో నారాయణ, డీఆర్డీవో మేన శ్రీను, జడ్పీ సీఈవో విద్యాలత పాల్గొన్నారు.

దాసరి కల్పనకు సన్మానం..

ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకలకు కేంద్ర ప్రభుత్వ ఆహ్వానం మేరకు హాజరైన స్వయం సహాయక సంఘం సభ్యురాలు దాసరి కల్పనను కలెక్టర్ సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో ఆమె మాట్లాడుతూ.. శాయంపేటకు చెందిన కల్పన నాన్ ఓవెన్ బ్యాగ్‌ల తయారీ యూనిట్‌ను స్థాపించి నెలకు రూ.10లక్షల టర్నోవర్‌తో మహిళా పారిశ్రామిక వేత్తగా ఎదిగారన్నారు. పేద మహిళ స్వయం సహాయక సంఘాల ద్వారా ఈ ఘనత సాధించారన్నారు.

కలెక్టరేట్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

కార్యక్రమంలో అడిషనల్ ఆర్డీవో సుధీర్ పాల్గొన్నారు.

బీసీ కాలనీలో కబ్జాపై ఫిర్యాదు..

కమలాపూర్ : మండల కేంద్రంలోని బీసీ కాలనీలో భూ కబ్జాలు చేస్తున్న వ్యక్తులపై కలెక్టర్ ప్రావీణ్యకు ఫిర్యాదు చేసినట్లు అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్నాల నరేందర్, జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం తెలిపారు. బీసీ కాలనీలో 1987లో 122మంది పద్మశాలి కులస్తులకు రెండు గుంటల చొప్పున అప్పటి ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసిందన్నారు. కొద్ది రోజులుగా కమలాపూర్ ఎస్సీ కాలనీకి చెందిన కొందరు వ్యక్తులు అక్రమంగా ప్రవేశించి ఆ భూమి తమదంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వారి ఆగడాలు తట్టుకోలేక పోతున్నట్లు వాపోయారు. కబ్జాకు గురైన స్థలాలను గుర్తించి నిరుపేద పద్మశాలి కులస్తులకు ఇప్పించాలని వారు కోరారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు రాజగోపాల్, పోరండ్ల కృష్ణ, ప్రసాద్, సత్యనారాయణ, వేణుగోపాల్, రవీందర్, మురళి పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్స్‌కు గుర్తింపు కార్డుల అందజేత..

హనుమకొండ చౌరస్తా : కలెక్టర్ ప్రావీణ్య జిల్లాకు చెందిన ఐదుగురు ట్రాన్స్‌జెండర్స్‌కు సర్టిఫికెట్, ట్రాన్స్‌జెండర్ గుర్తింపు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో మహిళ, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి జయంతి, ఎఫ్‌ఆర్వో రవికృష్ణ తదితరులు ఉన్నారు.

బల్దియా గ్రీవెన్స్‌లో కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్, ఫిబ్రవరి 3 : ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో నగరవాసులు తమ డివిజన్లలోని సమస్యలపై కమిషనర్‌కు వివరించారు. ఎక్కువగా ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలకు సంబంధించిన వాటిపై ఫిర్యాదు చేశారు. 10వ డివిజన్ పద్మాక్షి కాలనీలో రోడ్డుకు ఇరువైపులా బాక్స్ డ్రెయిన్‌ను వంకరగా నిర్మిస్తున్నారని, దీన్ని పరిశీలించి సరి చేయాలని మాజీ కార్పొరేటర్ మిద్దెల బాబు కోరారు. కేయూ రెండో గేట్ ఎదురుగా ఉన్న మైసూర్ బేకరీ నుంచి వీపరీతమైన దుర్వాసన వస్తున్నదని, భరించలేక పోతున్నామని విద్యారణ్యపురికి చెందిన బుచ్చిరెడ్డి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. 42వ డివిజన్ రంగశాయిపేట యాదవనగర్ నుంచి మైసమ్మ గుడి వరకు సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మించాలని కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. 43వ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. మిషన్ భగీరథ పైప్‌లైన్లతో పాటు సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని కోరారు. 36వ డివిజన్ చింతల్ ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలి నీరు వృధాగా పోతున్నదని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కమిషనర్‌కు విన్నవించారు. 41వ డివిజన్ విశ్వనాథ కాలనీలో సీసీ రోడ్డు, కరెంట్ స్తంభాలు వేయాలని కాలనీ వాసులు వినతిపత్రం అందజేశారు. అనంతరం కమిషనర్ అధికారులతో మాట్లాడుతూ.. గ్రీవెన్స్ వినతుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రీవెన్స్‌లో మొత్తం 64 వినతులు వచ్చాయి. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 30, ఇంజినీరింగ్ విభాగం 12, ప్రజారోగ్య విభాగం 9, పన్నుల విభాగం 8, తాగునీటి సరఫరా 4, హార్టికల్చర్ ఒక వినతి వచ్చింది. అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్‌వో రాజారెడ్డి, హెచ్‌వో రమేశ్, బయాలజిస్ట్ మాధవరెడ్డి, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీంద్రరాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, రాజేశ్వర్, ఎంహెచ్‌వో రాజేశ్, పన్నుల అధికారి రామకృష్ణ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

దామెర, ఫిబ్రవరి 3 : మండలంలోని పులుకుర్తి శివారులో బాలామాన సాదేవి సహిత ద్వాత్రిమద్గణపతి దేవాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో బాలమానసా మహా విద్యాపీఠం పీఠాధిపతి సద్గురు లక్ష్మీనారాయణగురు భవానీ, జడ్పీ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు, క్రెడాయి చైర్మన్ ఎర్రబెల్లి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగుల పక్షాన కొట్లాడండి అన్నా..

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం ముందు గోడు వెళ్లబోసుకున్న దివ్యాంగుడు

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్‌కు గోడు వెళ్లబోసుకుంటున్న దివ్యాంగుడు శ్రీధర్‌రావు

వరంగల్, ఫిబ్రవరి 3 : 'దివ్యాంగులను ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.. దివ్యాంగులు దీన స్థితిలో ఉన్నారు. మా కోసం కొట్లాడండి' అన్నా అంటూ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్‌ను ఓ దివ్యాంగుడు వేడుకున్నాడు. సోమవారం ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొని వస్తున్న వినయ్‌భాస్కర్‌కు జూలైవాడలో దివ్యాంగుడు శ్రీధర్‌రావు తన గోడు ఏకరువు పెట్టాడు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇచ్చిన రూ.4 వేల పెన్షన్ తప్పా కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తానన్న రూ. 6 వేల పెన్షన్ రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. సదరం సర్టిఫికెట్ల జారీలో జాప్యం జరుగుతున్నదని చెప్పాడు. దివ్యాంగుల సంక్షేమం కోసం అధిక నిధులు కేటాయించేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా చేసే ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరాడు.

పీహెచ్‌సీలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

నయీంనగర్, ఫిబ్రవరి 3 : హనుమకొండ పోచమ్మకుంటలోని పీహెచ్‌సీలో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించడంతో పాటు స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమా దేశ్‌పాండే హాజరై మాట్లాడుతూ.. రోజురోజుకు వివిధ రకాలైన క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి ఇఫతే దహర్, పీహెచ్‌సీ వైద్యాధికారి దీప్తి, అశోక్‌రెడ్డి, రామచందర్, శ్రీనివాస్‌రెడ్డి, నరేశ్‌కుమార్ పాల్గొన్నారు.

పోచమ్మకుంట పీహెచ్‌సీలో మహిళకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

PUBLIC NOTICE

Under the instructions of my client M/s: Shriram Finance Limited, Huzurabad Branch. I issue the following notice to general public. My client intends to grant to loan to title Nagula Krishnamurthi, S/o: Nagula Rajeshwar Rao, Age: 44 years, Occ: Business, R/o: H.No. 1-16, Somadevarapalle village Dharmasagar mandal of Hanamakonda dist by keeping the below mentioned property as security by way of Registered Mortgage. As such if anyone have any claims, charges mortgages, Sale agreements Court Attachment, court disputes etc., shall be informed to the address mentioned below in writing within 7 days from the date of this notice otherwise, later objections will not bind my client in this regard

SCHEDULE OF THE PROPERTY

All that the Residential House with open place bearing House No. 2-62/6/1/3/T, an extent of 260.94 Square yards or 218.17 Square meters, covered with RCC roof plinth area 1143.25 Square feet's & ACC sheet plinth area 304.50 Square feet's, within the boundaries on:
East: 10'-0" wide Road,
West: House of Moutam Chiranjeevi,
North: House of Yeshaboina Ashok,
South: House of More Ramulu
is situated at Somadevarapalle village Dharmasagar mandal of Hanamakonda dist
Date: 03-02-2025
Sd/- **G. LAXMANA MURTHY,** Advocate
Huzurabad. Cell No. 94403 69866

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

BUILDING FOR SALE

★H.No: 2-6-75, Circuit House, Nakalgutta Hanamkonda, Ground floor Bldg, 160.7 Sq.yds, 1000 sqft RCC buildup area, East Facing, 1.15 Cr. Clear tittle, Brokers pls excuse. **Contact: 9949912347, 999896 12347, 63025 53816.**
NTW-000

CHANGE OF NAME

★I, **Seelam Mani Chandana** (NEW NAME), R/O H. No 4-42, Narashimhula Gudem Village, Kusumanchi Mandal, Khammam Dist, 507159 Telangana State, India, changed my name from **Seelam Dimple** (OLD NAME) to **Seelam Mani Chandana** (NEW NAME) for all purposes.
NTW-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

జాతీయ రహదారి పక్కనున్న చెత్తను తొలగిస్తున్న జీపీ సిబ్బంది

జాతీయ రహదారి పక్కన చెత్త తొలగింపు

'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

శాయంపేట, ఫిబ్రవరి 3 : మండలంలోని మాందారిపేట శివారులో జాతీయ రహదారి పక్కన డంప్ చేస్తున్న చెత్తను పంచాయతీ సిబ్బంది తొలగించారు. 'జాతీయ రహదారి పక్కనే చెత్త డంప్.. డంపింగ్ యార్డులను వినియోగించుకోని జీపీ సిబ్బంది' శీర్షికన నమస్తే తెలంగాణలో సోమవారం ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీంతో పంచాయతీ అధికారులు వెంటనే స్పందించారు. మండల పంచాయతీ అధికారి రంజిత్‌కుమార్ మాందారిపేట గ్రామాన్ని సందర్శించారు. పంచాయతీ కార్యదర్శితో కలిసి 353సీ జాతీయ రహదారి పక్కన ఉన్న చెత్తను పరిశీలించారు. ప్రయాణికులకు ఇబ్బంది కలుగుతున్న నేపథ్యంలో వెంటనే జీపీ సిబ్బందితో హైవే పక్కనున్న చెత్తను తొలగించారు. మాందారిపేట డంపింగ్‌యార్డును పరిశీలించారు. ఎప్పటికప్పుడు చెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు తెచ్చి సెగ్రిగేషన్ చేయాలని సూచించారు.

సమావేశంలో మాట్లాడుతున్న హరిలాల్

15న సేవాలాల్ జయంతిని సెలవుగా ప్రకటించాలి

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 3 : ఫిబ్రవరి 15న సేవాలాల్ జయంతిని ప్రభుత్వం సాధారణ సెలవుగా ప్రకటించాలని గోర్‌సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిలాల్ బోడా పిలుపునిచ్చారు. సోమవారం హనుమకొండలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. తమ జనాభా ప్రాతిపదికన ఒక్కో నియోజకవర్గానికి రూ.20 లక్షలు వెచ్చించి సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాన్ని కలెక్టర్లతో గోర్ బంజారా, లంబాడీల సంప్రదాయం ప్రకారం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జీబీఎస్ఎస్ఎస్ అధ్యక్షుడు బాలాజీనాయక్ బదావత్, గోర్ సేన జిల్లా అధ్యక్షుడు తేజావత్ ఫణికుమార్, నాయకులు మాలోత్ నాను నాయక్, శ్రీకాంత్‌నాయక్, విష్ణు, శరత్‌నాయక్, సుమన్ లకావత్ పాల్గొన్నారు.

విహారయాత్రకు ఉప్పల్ విద్యార్థులు

కమలాపూర్, ఫిబ్రవరి 3 : మండలంలోని ఉప్పల్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం విహారయాత్రకు తరలివెళ్లారు. భూపాలపల్లి జిల్లాలోని గణపురం కోటగుళ్లు, ములుగు జిల్లాలోని రామప్ప, లక్నవరం, ఖిలావరంగల్ కోటను సందర్శించారు. విద్యార్థులు విహారయాత్రకు వెళ్లేందుకు గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త స్వర్గం రవి మనుమరాలు రియా రూ. 51వేలు సమకూర్చారు.



గణపురం కోటగుళ్లలో ఉప్పల్ బాలికల పాఠశాల విద్యార్థులు

లక్ష డప్పులు-వెయ్యి గొంతుల సభకు కదిలి రావాలి

ఆత్మకూరు : హౌసుబుజుర్గులో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 3 : లక్ష డప్పులు-వెయ్యి గొంతుల కార్యక్రమానికి మాదిగలంతా డప్పులు చేతబూని తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు పెండేల భిక్షపతి అన్నారు. సోమవారం హౌసుబుజుర్గు గ్రామంలో వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదిగ జాతి ఆవేదనను ప్రపంచానికి వినిపించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఉప్పురి మొగిలి, మంగళ్లపల్లి నవీన్, శంకర్, నీలం కుమార్, పెండెల కర్ణాకర్, సారంగపాణి, కుమార్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సామాజిక న్యాయమే..

హనుమకొండ చౌరస్తా : ఎస్సీ వర్గీకరణ సామాజిక న్యాయమేనని ఎస్సీ, ఎస్టీ, ఉపాధ్యాయ సంఘం వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు జేఎస్ పరంజ్యోతి అన్నారు. సోమవారం హనుమకొండలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 7న ఎస్సీ వర్గీకరణ అమలు కోసం నిర్వహించనున్న 'లక్ష డప్పులు-వేల గొంతులు' భారీ సాంస్కృతిక ప్రదర్శనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో దరిగి శ్రీనివాస్, భూమిగారి మోహన్‌రావు, సంకినేని వెంకట్, చిలుక విజయారావు, కొండపాకల కృష్ణ, కనకపు రమేశ్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కష్టపడి పనిచేయాలి

- భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

గ్రామాధ్యక్షుడిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

శాయంపేట, ఫిబ్రవరి 3 : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కష్టపడి పనిచేయాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. ఇటీవల ఎన్నికైన మండలంలోని కొప్పుల గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు మేకల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు శంకర్, కార్యదర్శి రాజయ్య, యూత్ అధ్యక్షుడు విష్ణు సోమవారం గండ్రను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో పార్టీని ముందుండి నడిపించాలన్నారు. పార్టీలో కష్టపడి పని చేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, మండలాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మేకల శ్రీనివాస్, మారెపల్లి నందం, గంటా శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాజీపేటలో ఆసరా స్టోర్ ప్రారంభం

కాజీపేట, ఫిబ్రవరి 3 : కాజీపేట పట్టణం సోమిడిలో ఓమ్ని మార్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో ఏర్పాటు చేసిన ఆసరా స్టోర్‌ను సోమవారం స్థానిక కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ ప్రారంభించారు. రైతులు, మహిళలు తయారు చేసిన వస్తువులు ఈ స్టోర్స్‌లో విక్రయించనున్నారు. కార్యక్రమంలో ఓమ్ని చీఫ్ ప్రాజెక్టు అధికారి బాకి బైరెడ్డి, చైర్మన్ రాజేశ్‌బాబు, డాక్టర్ మంద అశోక్‌కుమార్, మండల సమాఖ్య అధ్యక్షురాలు శ్రీవిద్య, జాన్ మార్కండేయ, ఆలేటి నవనీత తదితరులు పాల్గొన్నారు.

మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలి

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 3 : వరంగల్, ఖమ్మం, నల్లగొండ నియోజకవర్గ టీచర్ల ఎమ్మెల్సీగా మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థి దామెర బాబురావు కోరారు. సోమవారం హనుమకొండలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ.. 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు, 10 శాతం లేని అగ్రకుల అభ్యర్థుల మధ్య ఎమ్మెల్సీ ధర్మయుద్ధం జరుగుతున్నదన్నారు. ధర్మ టీచర్స్ యూనిటీ, వివిధ అధ్యాపక సంఘాలు బలపర్చిన రిటైర్డ్ హెడ్‌మాస్టర్ అణగారిన కులాల వ్యక్తిగా టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో తాను నిలుస్తున్నట్లు తెలిపారు. అగ్రవర్ణ ఆధిపత్య కులాలకు చెందిన టీచర్ల సంఘాల ప్రతినిధులు మాత్రమే పోటీ చేస్తున్నారని, 5 శాతం కూడా లేని అగ్రవర్ణ కూటమికి చెందిన ఒకే సామాజిక వర్గానికి చెందిన ఆయా సంఘాల పేరుపై ఎన్నికల్లో పోటీ చేసి గెలుస్తూ వస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు పాక లింగమల్లు యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామెర ఉపేందర్, రాష్ట్ర కార్యదర్శి బొల్లె సాంబయ్య, జిల్లా కన్వీనర్ జంగం సంజీవ్, దాసారపు శ్యామ్, మామిడి సురేశ్ పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి దామెర బాబురావు

ఏఎస్సైపై సీపీకి ఫిర్యాదు

ఎల్కతుర్తి, ఫిబ్రవరి 3 : న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వెళ్తే ఏకపక్షంగా వ్యవహరిస్తూ దుర్భషలాడాడని ఎల్కతుర్తి ఏఎస్సై ఉబేదుల్లాఖాన్‌పై బాధితుడు సీపీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. కమలాపూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన జక్కుల మహేశ్ తన సోదరికి సంబంధించిన పిటిషన్ విషయంలో ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. కాగా, ఏఎస్సై ఏకపక్షంగా వ్యవహరించాడని, అతడిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సీపీకి ఫిర్యాదు చేసినట్లు మహేశ్ తెలిపాడు. ఈ విషయంపై ఎస్సై ప్రవీణ్ కుమార్‌ను వివరణ కోరగా, జక్కుల మహేశ్‌పై వచ్చిన ఫిర్యాదు మేరకు అతడిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించగా, అతడే ఏఎస్సైతో దురుసుగా వ్యవహరించి రాద్ధాంతం చేస్తున్నాడని చెప్పారు.

అట్రాసిటీ కేసుపై ఏసీపీ విచారణ

ఎల్కతుర్తి, ఫిబ్రవరి 3 : డీజే పెట్టలేదని ఆపరేటర్ గొంతు కోసిన ఘటనపై నమోదైన అట్రాసిటీ కేసుపై సోమవారం కాజీపేట ఏసీపీ తిరుమల్ విచారించారు. మండలంలోని బావుపేట గ్రామంలో గత నెల 31న అదే గ్రామానికి చెందిన పున్నం సిద్ధు అలియాస్ అనిరుధ్ తనకు ఇష్టమైన పాట పెట్ట లేదని డీజే నిర్వహిస్తున్న ఈరెల్లి మధుకర్ గొంతు కోశాడు. ఏసీపీ తిరుమల్, సీఐ పులి రమేశ్, ఎస్సై అక్కినపల్లి ప్రవీణ్ కుమార్ బుధవారం ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. నిందితునిపై ఎస్సీ, ఎస్టీ కేసుతో పాటు మర్డర్ కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

వరంగల్ : భద్రకాళీ ఆలయంలో చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న అర్చకులు

చిన్నారులకు అక్షరాభ్యాసం

వరంగల్/భీమదేవరపల్లి, ఫిబ్రవరి 3 : : వసంత పంచమి పర్వదినం సందర్భంగా నగరంలోని ప్రసిద్ధ భద్రకాళీ ఆలయానికి భక్తులు పోటెత్తారు. భక్తులు తమ పిల్లలకు ఆలయ మహా మండపంలో అక్షరాభ్యాసం చేయించారు. భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూరు ప్రజాగ్రంథాలయం, ఎస్ఆర్‌కే లీడ్ పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ప్రజాగ్రంథాలయం నిర్వాహకులు గొల్లపల్లి లక్ష్మయ్య, వీరేశం, ఎదులాపురం తిరుపతి, వంగ రవి, అశోక్ ముఖర్జీ పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరం

పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్యులు

న్యూశాయంపేట, ఫిబ్రవరి 3 : హంటర్ రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రిలో మహిళలకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరం ప్రారంభిస్తున్నట్లు ఆస్పత్రి కన్సల్టెంట్, గైనకాలజిస్ట్ అమతుల్ హఫ్సా తెలిపారు. ఆస్పత్రిలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఇన్వెస్టిగేషన్ అండ్ కన్సల్టెన్సీ ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కడుపునొప్పి భరించలేక యువతి ఆత్మహత్య

హసన్‌పర్తి, ఫిబ్రవరి 3 : కడుపునొప్పి భరించలేక యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన మడిపల్లిలో జరిగింది. సీఐ చేరాలు కథనం ప్రకారం.. మడిపల్లికి చెందిన తొడుసు స్రవంతి (24) కొద్ది రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతుండేది. సోమవారం ఆమె తండ్రి సమ్మయ్య, సోదరుడు బయటకు వెళ్లగా స్రవంతి ఇంటి వద్దే ఉన్నది. మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో స్రవంతి కడుపునొప్పి భరించలేక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఇంటి చుట్టుపక్కల వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు తండ్రి సమ్మయ్య ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మద్యానికి బానిసై మరొకరు..

శాయంపేట : మద్యానికి బానిసైన వ్యక్తి గడ్డిమందు తాగి దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై జక్కుల పరమేశ్ సోమవారం తెలిపారు. మండలంలోని కొత్తగట్టుసింగారం గ్రామానికి చెందిన మౌనికకు కొత్తగూడకు చెందిన బొమ్మినేని రంజిత్(32)తో పదిహేనేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి చరణ్‌తేజ్, ఇందుశ్రీ పిల్లలున్నారు. వీరు కొత్తగట్టుసింగారంలో ఉంటూ మౌనిక తల్లిదండ్రులకు చెందిన రెండెకరాల వ్యవసాయ భూమిని సాగు చేస్తున్నారు. రంజిత్ నాలుగు నెలలుగా ఎలాంటి పనులు చేయకుండా మద్యానికి బానిసై ఇంటి వద్దే ఉంటున్నాడు. దీంతో మౌనిక భర్త రంజిత్‌ను మందలించింది. మనస్తాపానికి గురైన రంజిత్ గత నెల 23న ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగాడు. స్థానికులు గమనించి 108కి సమాచారం ఇచ్చి ఆస్పత్రికి తరలించారు. ఎంజీఎం దవాఖానలో చికిత్స పొందుతున్న రంజిత్ పరిస్థితి విషమించి ఈ నెల 2న మృతి చెందినట్లు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

ఏకపాత్రాభినయంలో అభిరామ్ ప్రపంచ రికార్డు

ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డులో నమోదు

విద్యార్థి అభిరామ్‌ను అభినందిస్తున్న స్కూల్ యాజమాన్యం

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 3 : హంటర్‌రోడ్డులోని వరంగల్ పబ్లిక్ స్కూల్‌లో 9వ తరగతి అభ్యసిస్తున్న ఇమ్మడి అభిరామ్ ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు సంపాదించాడు. అభిరామ్ మహాభారతంలోని కర్ణుడి వేషధారణలో 5 నిమిషాల 30 సెకన్ల పాటు అనర్గళంగా ఏకపాత్రాభినయం చేశాడు. దీన్ని ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డులో నమోదు చేసి సూపర్ టాలెంట్ కిడ్ అవార్డుకు ఎంపిక చేశారు. స్కూల్ కన్వీనర్ ఈరసాని వెంకట్రామిరెడ్డి, డైరెక్టర్ శ్రీరాముల ఉమారాణి, అడిషనల్ డైరెక్టర్ గూడూరు జ్యోతి, ప్రిన్సిపల్ గౌరీ కల్యాణి, వైస్ ప్రిన్సిపాల్ కవిత విద్యార్థిని అభినందించారు.

లైబ్రరీ సైన్స్ విద్యార్థులకు విస్తృత ఉద్యోగావకాశాలు



ప్రసంగిస్తున్న రిజిస్ట్రార్ రామచంద్రం

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 3 : లైబ్రరీ సైన్స్ విద్యార్థులకు విస్తృతమైన ఉద్యోగావకాశాలు ఉన్నాయని రిజిస్ట్రార్ రామచంద్రం అన్నారు. సోమవారం కేయూ గ్రంథాలయ విభాగాధిపతి రాధికారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఎల్ఐఎస్సీ 2023-24 బ్యాచ్‌లో అత్యధిక మార్కులు సాధించిన భాగ్యలక్ష్మికి ఖమ్మంలోని వెంపటి లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్ అందజేసిన రూ.10 నగదు పురస్కారం, అవార్డు బహూకరించారు.

కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా నర్సింహారావు

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 3 : కాకతీయ విశ్వవిద్యాలయ సహాయ రిజిస్ట్రార్ మండవ నరసింహారావును అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా (డాక్యుమెంటేషన్) నియమిస్తూ రిజిస్ట్రార్ రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. నరసింహారావు ప్రస్తుతం పబ్లికేషన్ సెల్ సంచాలకులుగా, దూరవిద్యా కేంద్రం సహాయ రిజిస్ట్రార్‌గా ఉన్నారు. జనవరి 31న డిప్యూటీ రిజిస్ట్రార్ సారయ్య ఉద్యోగ విరమణ చేయడంతో ఈ ఖాళీ ఏర్పడింది. 1992లో సీసీటీగా ప్రవేశించిన నరసింహారావు సోషియాలజీలో డాక్టరేట్ పొందారు. ఆయన వైస్ చాన్సలర్ పేషీ, అడ్మినిస్ట్రేషన్, పీజీ కాలేజీ, ఆర్ట్స్ కాలేజీ, ఇంజినీరింగ్ కాలేజీ, పరీక్షల విభాగం, హాస్టల్ ఆఫీసుల్లో పనిచేశారు.